# "ప్రకృతి సాక్షిగా"

జీవితం ఎంతో అందమైంది. అందమైన గులాబీపువ్వు ప్రక్కనే సూది మొనలాంటి ముళ్ళుంటాయి. సుకుమారంగా వుండే పువ్వు ప్రక్కన ముళ్లెందుకంటే అర్థం చెప్పలేము. జీవితం రసమయంగా వుండాలంటే అన్ని విషయాలకు అర్థం తెలియకుండా వుండాలి. అన్నీ తెలిస్తే జీవితంలో మాధుర్యం ఏముంటుంది?

రహస్యాలన్నీ తెలిస్తే జీవితమంటే విసుగుపుట్టదూ!

"ఆత్మహత్యలెందుకు చేసుకుంటారు బాబు గారూ?"

సింహాచలం అడిగిన ప్రశ్న విని ఉలిక్కిపడ్డాడు సత్యమూర్తి.

అల్లకల్లోలంగావున్న సముద్రం మీద జడివానలా వుందా ప్రశ్న. కల్లోల కడలిలావున్న మనస్సును అదుపులో పెట్టుకుంటూ సింహాచలంవైపు చూసేదు.

"బతకడంకంటే చావే మేలనుకున్నప్పుడు చావడానికి తెగిస్తారు" అన్నాడు సత్యమూర్తి. పెరిగిన గడ్డం సవరించుకుంటూ.

'నూటయాభైయ్యేళ్ళు ఎవడు బతకడుకదా! ఎటూ అందరం చచ్చిపోయేవాళ్లమే... ముందే చనిపోవడానికి తెగించడమెందుకు?"

సింహాచలం ప్రశ్నకు సమాధానం దొరకలేదు. మౌనంగా వుండిపోయాడు సత్మమూర్తి.

వాళ్ళిద్దరూ ఎత్తైన కొండమీద నుండి కిందకు దూకుతున్న సెలయేరువైపు చూస్తూ కూర్చున్నారు.

కొండదిగువ భాగంలో పెద్ద నీటిమడుగు వుంది. చుట్టూ దట్టంగా చెట్లతో ఆ ప్రాంతం చూడటానికి ఎంతో ఆహ్లాదంగా వుంటుంది. ఐదుమైళ్ళ దూరంలో వున్న పట్నంనుంచి ఆటోల్లో, స్కూటర్లమీద అక్కడికి వస్తారు సెలవుదినాల్లో చాలామంది.

ఆ సెలయేరు ప్రాంతం పిక్నిక్ స్పాట్ అయ్యింది. అక్కడికి కిలో మీటరు దూరంలో ఓ పల్లెటూరు కూడా వుంది. జామకాయలు, వేరు శెనక్కాయలు, రేగిపళ్ళు అమ్ముకోవడానికి నలుగురైదుగురు కుర్రాళ్ళు ఆ గ్రామం నుంచి వస్తారు తప్పితే మిగిలినవాళ్ళు ఎవ్వరూ అటు ప్రక్కకిరారు.

గ్రాస్థులెవ్వరూ అటుప్రక్కకి రాకపోవడానికి  కారణం ఒకటివుంది. పట్నంనుంచి సెలయేరు చూడటానికి వచ్చినవాళ్లలో ఓ పదిమంది కొండ మీద నుండి నీళ్ళలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు ఈ మధ్యనే.

అంతకుముందు అటువంటి సంఘటనలు అక్కడ ఎప్పుడూ జరుగలేదు. అడవిమధ్య కొండమీద నుంచి క్రిందికి పెద్దగా శబ్ధం చేస్తూ దూకే సెలయేటి అందాలు తనివితీరా చూసేవాళ్ళు తప్పితే ఆత్మహత్య చేసుకుందామనే ఆలోచనలతో ఎవ్వరూ అక్కడికి వచ్చే వాళ్ళుకాదు.

తమ పెళ్ళికి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో ఓ ప్రేమికుల జంట ప్రకృతి సాక్షిగా ఒకరి చేతులు మరొకరు పట్టుకుని కొండమీద నుండి నీళ్ళలోకి దూకేరు.

ప్రకృతి మొదటిసారి కన్నీళ్ళు పెట్టుకుంది.

ఆమె కన్నీళ్ళు  తుడవడానికి బదులు మళ్ళీమళ్ళీ ఏడ్పించేరు పట్నంవాళ్ళు.

తాగుబోతు భర్తతో అవస్థలు పడలేక ఓ యువతి–పరీక్షల్లో తప్పిన ఓ విద్యార్థి –

పిల్లలకు తిండిపెట్టలేక ముందు పిల్లల్ని. ఆ తర్వాత భార్యను కొండమీదనుండి తోసేసి తాను కొండమీదనుండి నీళ్ళలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఓ నిరుద్యోగి –

కడుపునొప్పి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న ఓ ఉద్యోగి శవం – మానభంగంచేసి గొంతుపిసికి చంపేసి కొండమీదనుండి తోసేసిన ఓ యువతి శవం ఆ సెలయేటి నీళ్ళల్లోనే దొరికేయి.

సత్యమూర్తి బాగా చదువుకున్నవాడు. కాలేజీలో లెక్చరర్. సాహితీవేత్త కూడ. రెండు మూడు కవితా సంపుటాలు వెలువరించాడు. ప్రముఖుల జీవితచరిత్రలు కూడా రాశాడు.

ఎంతో మంది జీవితచరిత్రలు రాసిన అతను తన జీవితం ముగింపు బ్రతుకు పుస్తకంలో తనే రాసుకునే ప్రయత్నంలో వున్నాడు.

సింహాచలం ఆ విషయం పసిగట్టాడు.

సెలయేటి అందచందాలు చూడటానికి ఒచ్చే వాళ్ళెవ్వరో, సరదాగా అక్కడ కాలక్షేపం చెయ్యడానికి ఒచ్చినవాళ్ళు ఎవరో, దిగులుపడుతూ అక్కడ కూర్చునేవాళ్ళు ఎవరో అతను ముఖకవళికలు చూసి పసిగట్టగలడు.

ఆందోళనతో సతమతమయిపోతూ, విరక్తిగా సెలయేటి నీళ్ళలోకి చూస్తున్న సత్యమూర్తిని చూడగానే కొంత సంబరపడ్డాడు సింహాచలం.

అదే ప్రదేశంలో సత్యమూర్తిని అంతకుమునుపు చాలాసార్లు చూసేడు. ఎప్పుడూ పెదాలమీద చెరగని చిరునవ్వుతో కన్పించే అతన్ని పలుకరించకుండా వుండలేకపోయేవాడు. ఏదో పిచ్చాపాటి మాట్లాడేవాడు. గ్రామం సంగతులు, తను చేసే వడ్రంగి పని గూర్చి చెబుతూ వుండేవాడు సత్యమూర్తికి.

ప్రపంచంలోని విషాదమంతా తన ముఖంలో దాచుకుంటున్న సత్యమూర్తిని చూడగానే జీవితంలో ఏదో ఎదురుదెబ్బతిన్నాడని మనస్సులోనే గట్టిగా అనుకున్నాడు.

“చీకటిపడబోతుంది... పట్నం తిరిగి వెళ్ళిపోండి” అన్నాడు సింహాచలం.

మనస్ఫూర్తిగా అనలేదు ఆ మాటలు. ‘అతను ఆత్మహత్య చేసుకుంటేనే బాగుండును’ అనుకున్నాడు మనస్సులో.

“నువ్వెళ్ళు... నేనో పదినిముషాలు వుండి ఇంటికి తిరిగి వెళ్ళిపోతాను” అన్నాడు సత్యమూర్తి.

అతను అక్కడనుంచి కదలడని సింహాచలంకు తెలుసు.

‘ఆ చేప తప్పకుండా తన వలలోనే పడుతుంది’ అనుకుంటూ ఇంటిముఖం పట్టాడు సింహాచలం.

ఇంటికి వెళ్ళేసరికి పిల్లాడిని ఒళ్ళో పడుకోబెట్టుకుని ఏడుస్తూ కన్పించింది సముద్రాలు.

“జ్వరం తగ్గలేదా?” పిల్లాడి చెంపలకి తన చెయ్యి తాకిస్తూ అడిగేడు సింహాచలం.

“ఎవడు ఛస్తాడానని గోతికాడ నక్కలాగా ఆ సెలయేరు దగ్గర కాసుక్కూర్చో! నీకు పెళ్ళాంబిడ్డల సంగతి ఏంపట్టింది? పిల్లాడికి వారంరోజుల్నుంచి మూసిన కన్ను తెరవడంలేదు... వీడిని డాక్టరు దగ్గరకు తీసుకెళ్దామన్న ధ్యాసేలేదు... ఇరవై నాలుగుగంటలూ ఆ సెలయేరు దగ్గరే పడిగాపులుగాస్తావ్ !” అందామె ముక్కు చీదుకుంటూ.

"అన్నం వండేవా?" పాకలోకి వెళ్ళబోతూ అడిగేడతను.

"నువ్వు పనిమానేసి నెలరోజులయ్యింది... షాపు కారుగారి కొత్త ఇంటికి తలుపులు, కిటికీలు చెయ్యాలంట... వీరభద్రం బాబాయి నీకోసం రెండుమూడు సార్లు యింటికి వచ్చివెళ్ళాడు... ఆ బాబాయ్ వెంట తిరిగితే రోజూ ఏదో ఒక పని దొరుకుతుంది... కష్టపడి పనిచేసుకోకపోతే తిప్పలు తప్పవ్... రెండు రోజులయ్యింది కడుపునిండా తిండి తిని... పిల్లాడికి రొట్టె ముక్క కొందామన్నా చేతిలో పైసాలేదు" ఇబ్బందులన్నీ ఏకరపు పెట్టింది.

ఆ ఇబ్బందులన్నీ సింహాచలంను తెలీనివికావు. సెలయేరు దగ్గర కొండమీదనుంచి ఎవడోకడుదూకి ఆత్మహత్య చేసుకోకుండా వుండడని నెలరోజుల్నుంచి ఎదురుచూస్తున్నాడు.

సింహాచటం గజ ఈతగాడు.

నీళ్ళలోకి దిగాడంటే చేపకూడ ఈతలోని మెళకువలు అతన్నుంచి నేర్చుకోవాల్సిందే!

సెలయేరు దగ్గరి చిన్నసరస్సులా వుండే నీటి మడుగు ప్రాంతమంతా మున్సిపాలిటీ పరిధిలోకే వస్తుంది. కొండమీదనుంచి దూకి ఆత్మహత్యలు చేసుకునేవాళ్ళ సంఖ్య పెరుగుతూ వుండటం మున్సిపాలిటీవాళ్ళను వేధిస్తూనేవుంది. ఆత్మహత్యలు నిరోధించడానికి, ఆపే ప్రయత్నం చేయడానికి మున్సిపాలిటీకి తీరికలేదు. మంచినీళ్ళు సరఫరా చెయ్యడానికి, పారిశుద్ధ్యం నిర్వహణే తలకుమించిన భారంగా వుంటే ఆత్మహత్యలు చేసుకునేవాళ్ళ గూర్చి ఆలోచించడానికి సమయం ఎక్కడుంటుంది?

కొండమీదనుండి నీటిలోకి దూకిన వాళ్ళ శవాలు ఇరవైనాలుగు గంటల తర్వాత ఏ రాళ్ళసందునో తుంగగడ్డి దగ్గరో తేలుతాయి. నీళ్ళలో ఈదుకుంటూ సరస్సు అంతా గాలించి శవంఆచూకి తెల్సుకుని ఒడ్డుకి శవాన్ని చేర్చడం అందరికీ చేతనయ్యేపని కాదు. ఈత వచ్చినవాళ్ళు కూడా శవాన్ని తాకాలంటే భయపడతారు. సింహాచలం జంకూగొంకూ లేకుండా శవాన్ని ఆటవస్తువు పట్టుకొచ్చినట్లు ఒడ్డుకు చేరుస్తాడు. అందుకనే శవం ఆచూకీ తెల్సుకోవడం కోసం అతన్నే ఆశ్రయిస్తూ వుంటారు మున్సిపాలిటీ వాళ్ళు.

శవంకోసం నీళ్ళలో గాలించడం ఒక్కోసారి రోజంతా పడుతుంది. రోజంతా నీళ్ళలో నానుతూ వుండాలి. దొరికిన శవం బాగా ఉబ్బిపోయి, రూపు రేఖలు గుర్తుపట్టలేనందగా మారిపోయి ముక్కులు పగిలి పోయేటంత దుర్వాసన కొడుతూ వుంటుంది.

మున్సిపాలిటీ వాళ్ళు యిచ్చే వెయ్యి రూపాయిలకు ఆశపడి, ఇబ్బందికరమైనా ఒడ్డుకు శవాన్ని చేర్చుతూ వుంటాడు సింహాచలం.

నెలకు ఒకటో, రెండో శవాలు దొరకాలని మనస్సులో ఎప్పుడూ మొక్కుకుంటూ వుంటాడతను. ఒక్కరోజు ఏలాగొలా కష్టపడితే నెలరోజులు కాయకష్టం తప్పుతుంది. వడ్రంగి పనిచేసే పని తప్పుతుంది...

నెలరోజుల్నుంచి ఒక్క గిరాకీ దొరకలేదు. ఎవ్వరూ ఆత్మహత్య ప్రయత్నం చేయ్యలేదు.

అందుకనే జీవితం మీద విరక్తిచెందినట్లు కన్పించిన సత్మమూర్తిని చూడగానే అతనికి సంతోషమేసింది.

... మరుసటిరోజు సత్మమూర్తి శవం నీళ్ళలో తేలుతుంది...

... అతని శవాన్ని నీళ్ళలోనుంచి బయటకు తీయమని మున్సిపాలిటీవాళ్ళు తనను పురమాయిస్తారు...

మరో నెలరోజులు పస్తులుండే ఇబ్బంది తప్పుతుంది తమకు ...

అతని కళ్ళల్లో నీళ్ళల్లో తేలుతున్న సత్యమూర్తి శవం కదలాడింది.

అతని ప్రక్కన వచ్చి కూర్చుంది సముద్రాలు.

తన ఒడిలోవున్న పిల్లాడిని అతని చేతుల్లో వుంచిందామె.

బొగ్గుల కుంపటి చేతుల్లో వుంచనట్లనిపించిందతనికి. ... మాయదారి జ్వరం... తగ్గిపోతే బావుణ్ణు!

ఒక్కడే కొడుకు... ఆడు తనకు దక్కడా? కోడుకు శవంలా కన్పించేడు.

అతను ఉలిక్కిపడ్డాడు. వెన్నులో వణుకు పుట్టుకొచ్చింది.

"నామాట వినుకో... శవాలమీద ఏరుకొచ్చిన పైసలతో సంసారం నెట్టుకురావాలని అనుకోబోక... రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడదాం. ఉంటే తిద్దాం లేకపోతే పస్తులుందాం... శవాలవేట నువ్వు మానేస్తానని పిల్లాడిమీద ఒట్టేసి చెప్పు!" వింది సముద్రాలు ఏడుస్తూ.

కదిలిపోయాడతను.

ఆమె చెప్పింది నిజమే!

'ఎవడోకడు ఆత్మహత్య చేసుకోవాలి.. తన కడుపు నిండాలి' అని తను అనుకుంటే 'సింహాచలం కొడుకు చచ్చిపోతే బావుణ్ణు!' అని కాటికాపరి అనుకోడూ! పాతి పెట్టడానికి గొయ్యితీస్తే పదిరూపాయిలొస్తాయని వాడుమాత్రం ఆశపడడూ!

అతని బుర్రవేడెక్కిపోయింది.

ఒక్కక్షణం కూడా అక్కడ కూర్చోలేక సెలయేరు దగ్గరకు పరుగెత్తాడు.

వెన్నెల పుచ్చపువ్వులా కాస్తుంది.

సెలయేటి గలగలల చప్పుడు తప్పితే అంతటా నిశ్శబ్దం ఆవిరించుకుని వుంది.

వెన్నెట్లో సత్యమూర్తి కన్పించేసరికి కొంత కుదుటబడ్డాడు సింహాచలం.

కళ్ళుమూసుకుని కొండ మీదనుండి క్రిందికి దూకబోతున్న సత్యమూర్తిని గట్టిగా వాటేసుకున్నాడు.

"బాగా చదువుకున్న మారాజులు... మీరు చెయ్యాల్సిన పనికాదండీ బాబూ!"

"నా బాధ నీకేం తెలుసు?" "ఏమిటి బాబూ! మీకొచ్చిన అంత కష్టం... తిండికి లేక ఇబ్బందిపడుతున్నారా? భార్యాబిడ్డలు రైలు ప్రమాదంలో మరణించేరా ? ఎవరినన్నా హత్యచేశారా?"

"అవేంకాదు... మా ఆవిడ పక్కింటాయనతో శారీరక సంబంధం పెట్టుకుంది"

"ఓస్... అదా కారణం" పెద్దగా నవ్వేడు సింహాచలం.

"నీ పెళ్ళాం ఎవడితోనన్నా తిరిగితే అప్పుడు తెలుస్తుంది ఆ బాధేమిటో?" అన్నాడు సత్యమూర్తి ఉద్వేగంతో.

మళ్ళీ నవ్వాడు సింహాచలం.

"నా జేబులో వంద రూపాయిలున్నాయి.... అవి తీసుకుని యిక్కడనుంచి వెళ్ళిపో ! నా చావు నన్ను చావనీ"

"రెండ్రోజులు గట్టిగా వడ్రంగి పనిచేస్తే వంద రూపాయలు నేనూ సంపాదిస్తాను. కానీ ఎన్ని వందలు ఖర్చుపెట్టినా పోయిన ప్రాణం తిరిగిరాదుగా!"

"నాకు బ్రతకాలని లేదు"

" మీ ఆవిడ తప్పుచేస్తే మీరు ప్రాణాలు వదలటమేమిటండీ... ఆవిడకు నచ్చచెప్పండి... మీ మాట వినకపోతే ఆవిడను వదిలేయండి... ఈ చిన్న విషయానికి కొంపలు మునిగిపోయినట్లు బాధపడతారేమిటండీ?"

సింహాచలం మాటలు అతనిలో ఆలోచనలు రేకెత్తించాయి.

అతను చెప్పింది సబబుగానే తోచింది. భార్య తప్పుచేసిన మాట నిజమే! చేసిన తప్పును సరిదిద్దుకునే అవకాశం ఆమెకు యిచ్చేడా తను? ...

... ఇవ్వలేదే!...

....మనిషిగా తాను ఎదగడానికి ఇది మంచి అవకాశం... ఈ అవకాశాన్ని వదులుకోగూడదు... తన మంచితనమేమిటో భార్య గ్రహించాలి!...

... ఈ క్షణం నుండి తను గతం మర్చిపోతాడు... కొత్త జీవితం మొదలెడతాడు... ప్రతిక్షణం జీవించడం ఎలాగో నేర్చుకుంటాడు తాను..

"సింహాచలం... ఇక ముందెప్పుడూ ఆత్మహత్య ప్రయత్నం చేయనయ్యా!" సత్యమూర్తి మనస్ఫూర్తి గానే అన్నాడు, ప్రకృతి సాక్షిగా ఆ నిర్ణయం తీసుకుని.

ఇంటికి తిరిగి ఒచ్చేడు సింహాచలం. రాత్రి బాగా పొద్దుపోయింది.

కొడుకు ఒంటిమీద చెయ్యేసి చూశాడు.

బాగా చెమటలుపట్టేసి జ్వరం తగ్గుముఖం పట్టింది.

"ఉదయాన్నే లేపు... వీరభద్రం బాబాయ్ వెంట వడ్రంగి పనికి వెళ్తాను" అన్నాడు భార్యతో నిద్రలోకి జారుకోబోయే ముందు సింహాచలం. *

**(స్వాతి వార పత్రిక కథల పోటీల్లో మూడవ బహుమతి పొందిన కథ - 1-10-1993)**